కదలకుండా చేశారు. రాక్షసుడు మీదపడ్డాడు. "ఏవండి" అని కేకపెట్టి తన్నుకుంటున్న ఆమె నోట్లో గుడ్డలు కుక్కారు. వాళ్ళ అక్కసు తీరా ఆమెను కుళ్ళబొడిచారు. తన ఒళ్ళు తనది కాకుండాపోయి విపరీతమైన హింసకు లోనవుతూవుంటే ఆమెకు తెలివి తప్పిపోయింది.

హాస్పిటల్లో తెలివొచ్చింది. జరిగింది సరిగ్గా జ్ఞాపకం లేదు. పట్టరాని ఏడుపు. గుండెల్లో మంట. ఒళ్ళంతా మంట. లోపలిమంటలో దేనికోసమో వెతుకులాట.

నేను... నేను... సీత... ఎవరు మైలపడిపోయింది?

మెదడులో అగ్నిపర్వతం బ్రద్దలైంది.

ఛీ, ఈ శరీరం నాది కాదు

ఇది మురికి, పెంట, కుళ్ళు, అసహ్యం.

దఃఖం, బాధ, కసి, ద్వేషం...

ఇది నశించిపోవాలి. కుళ్ళు నాశనం చెయ్యాలి. మంట ఆరాలి...

అందరూ ఏమరి వున్నప్పుడు బయటికెళ్ళింది. బావిలో దూకింది.

ఎవరో పెద్దగా అరిచారు.

తెలివివచ్చేసరికి మళ్ళీ మంచంమీదనే వున్నది.

బరువు, ఆయాసం. ఊపిరికోసం, ప్రాణశక్తికోసం గింజుకుంటోంది శరీరం.

మెల్లగా కళ్ళెత్తి చూసింది. గోపాలరావు కనిపించాడు. అతన్ని పరీక్షగా చూసింది. 'నేను చావాల్సిందే' అనుకుంది. బతికి ఏం చెయ్యాలి? ఆమె సుశీలకాదు, పేరు నిలబెట్టలేదు. మంచందగ్గర లింగప్ప కాపలా వున్నాడు. "ఎండ్రిన్‌గాని ఏదైనా గుక్కెడు విషం తెచ్చిపెట్టు లింగప్పా" అన్నది. కునుకులోంచీ మగతగా విన్న లింగప్ప గోడకు జారగిలపడి తలగోక్కుని "పానం పోగొట్టుకోటం ఏలనమ్మ. ఎందరు జనాలు బతకటంలేదు! దేవుడు పెట్టినయ్యన్నీ అనుబగించాలి గెదా" అన్నాడు.

దేవుడు! ఆ పేరెత్తితేనే ఆమెకు కక్షపుట్టింది. ఎవడు దేవుడు? ఎక్కడున్నాడు? వాడి న్యాయం ఏమిటి? నిజంగా దేవుడనే వాడుంటే గుడిముందే ఇటువంటి అత్యాచారం జరుగునా?!

అత్తా, ఆడబిడ్డా వచ్చారు. కన్నీళ్ళు కార్చారు. "ఆ ప్రాణం అప్పుడే పోయుంటే బాగుండేది. ఏ పాపం చేసుకున్నావో కర్మ!" అన్నారు.

నాన్నగారూ, అన్నా, చెల్లెలూ వచ్చారు. తనకోసం బాధపడి ఏడ్చారు. కాని తనని బతికించగలమాట వాళ్ళ దగ్గరలేదు.

గోపాల్ యిహ ఎన్నటికీ తనను 'సీతా' అని పిలవడు. తప్పు జరిగింది. ఎక్కడో తెలియడం లేదు. సందిగ్ధత, భయం.

లింగప్ప లేనప్పుడు మెల్లగా లేచింది. సంధ్యవెలుగులోనికి నడిచింది.

చెరువు ఎండిపోయి వున్నది.

కట్టమీద నిల్చుని ఆకాశంవైపు చూచింది. పెద్దగోళం-అనంతమైనది, కదలనిది, మారనిది, ఎరుగరానిది-మాతృగర్భంలా తనను చుట్టుకొని వున్నట్లనిపించింది. అట్లాగే చూస్తూ నిలుచుంది.. ఆ కదలని దాన్లోనే దిగిపోయే సూర్యుడు, ప్రాముఖ్యతలోనికొస్తున్న చంద్రుడు, కళ్లు తెరుస్తున్న నక్షత్రాలు-వెలుగులో క్షణక్షణం మారుతున్న ప్రపంచం-అంతా తానే!

ఆమెకు సంతోషం కలిగింది. మనసు తేటపడింది. గుడిదగ్గర గట్టుమీదనే ఎంతోసేపు నడిచింది. ఆమె మనసులో భారం లేదు. 'నాకు అంటిన తప్పు ఏది?' అని తన్ను తాను చూచుకున్నది. 'నాకు తప్పు అంటితే నాలో ప్రాణం ఎందుకున్నది? ప్రాణం భగవంతుడు కదా?' అనుకుంది తేలిగ్గా.

భగవంతుడికి తప్పొ ఒప్పొలేవు. పాపం పుణ్యం లేవు. ఆయనే అఖండమైన ప్రేమ. అనంతమైన కరుణ.

ఆమె మెదడులో గొప్ప కంపం కలిగింది.

ఆనందమో ప్రేమో ఉన్మాదమో-ఏదో తెలియరాని స్పృహ వెల్లువలా పొంగింది.

అష్టమి చంద్రుడు చచ్చిపోయాడు. అంతావెలుగే. అంతా చీకటే.

ఆమె కాలికి ఎదుర్రాయి తగిలింది. బోర్లాపడి క్రిందికి దొర్లిపోయింది. రాళ్ళు తగిలినచోట చర్మం చీరుకుపోయింది. ఆమెకు నొప్పి తెలియలేదు. భయం తెలియలేదు. అక్కడి రాళ్ళలో రాయిగా, మట్టిలో మట్టిగా, ఆ సత్యంలో సత్యంగా ప్రకృతి గర్భంలోకి చేరిపోయింది.

చెరువుదగ్గర నిశ్శబ్దం, పరమశాంతి.

★★★